
# హృదయ వైశాల్యం

"కల్పనా! ఏమిటి తీవ్రంగా ఆలోచిస్తున్నావ్?" చిరునవ్వుతో అడిగాడు భర్త అరవింద్.

భర్త పలకరింపుకు ఒక్కసారిగా ఉలిక్కి పడింది కల్పన.

"నా స్నేహితురాలు వందన గురించి ఆలోచిస్తున్నాను" అంది కల్పన.

"ఏమిటంత సీరియస్ మేటర్?" మళ్లీ ప్రశ్నించాడు అరవింద్.



కథా నిలయం
శ్రీకాకుళం

"మీకు ఎపుడూ చెబుతుంటాను కదా! అదే విషయం ఆలోచిస్తున్నాను. నా స్నేహితురాలు వందన కంటే మనం ఒక మెట్టు ఎక్కువలో ఉండాలి. లేదా కనీసం వాళ్ల స్థాయితో సమానంగా అయినా ఉండాలి. అంతేకానీ వాళ్ల కంటే తక్కువలో మాత్రం ఉండకూడదు" ధృఢంగా అంది కల్పన.

"నీ మనోభావం నాకు అర్థమైంది కల్పనా. కానీ నీ స్నేహితురాలు నీ కంటే మంచి ఉద్యోగం చేస్తోంది. ఆమె భర్త కూడా నా కంటే పెద్ద ఉద్యోగం చేస్తున్నాడు. వాళ్లు జీవితంలో త్వరగా స్థిరపడ్డారు. వారికీ మనకీ చాలా వ్యత్యాసం ఉంది. వారితో పోటీ పడటం చాలా కష్టం. నువ్వు అలా పోటీపడితే చివరికి నీకు మనస్తాపమే మిగులుతుంది" అన్నాడు నిర్మొహమాటంగా.

"అలా అంటే ఎలాగండీ? నా స్నేహితురాలు నా కంటే పైస్థాయికి వెళ్లిపోవడం నాకు బాధగా ఉండదా? మీ అభిప్రాయం నిజమే కానీ, నా ఉద్దేశ్యమేమంటే మనం ఇప్పటికే వేగంగా కొన్ని మెట్లు ఎక్కాం. ఆ వేగాన్ని ఇంకాస్త పెంచి, పొదుపుగా, జాగ్రత్తగా, తెలివిగా, టెక్నిక్స్ ఉపయోగించి మరికొన్ని మెట్లు ఎక్కగలిగితే రెండేళ్లలో వారి స్థాయికి చేరుకుంటాం. వారి స్థాయిని కూడా అధిగమించాలనే విషయాన్ని తర్వాత ఆలోచిస్తాను" అంది కల్పన.

"అయినా కష్టమే కల్పనా! నీ స్నేహితురాలు వందన వాళ్లు మంచి ఇల్లు కట్టుకున్నారు. కారు కొన్నారు. గోల్డ్ బాగా సంపాదించారు. మనమైతే ఇప్పటికి ఇల్లు మాత్రం కట్టగలిగాము. ఇన్ని మెట్లు దిగువలో ఉన్నాం. అన్ని మెట్లు ఎప్పటికి ఎక్కగలుగుతాము? ఆలోచించు కల్పనా" అన్నాడు అరవింద్.

"అవన్నీ ఆలోచించే ఈ విషయం మీతో డిస్కస్ చేస్తున్నానండీ. మనం వాళ్లతో సమాన స్థాయికి ఎదగాలంటే ఏ విషయంలో కష్టపడాలో, ఏ విషయంలో త్యాగం చేయాలో ఎటువంటి అవసరాలకు ప్రాముఖ్యత ఇవ్వాలో, ఏ అవసరాలను నిర్లక్ష్యం చేయాలో ఒక ప్రణాళిక వేసుకోవాలి. ఈ రోజు మనం ఫ్రీగానే ఉన్నాం కాబట్టి ఆ ప్రణాళిక ఈ రోజే వేసేద్దాం" అంది కల్పన.

"ఓకే కల్పనా ఈ విషయంలో నేను నీకు పూర్తిగా సహకరిస్తాను. ఈ రోజు నుంచి నువ్వే ఆర్థిక మంత్రివి" అన్నాడు అరవింద్.

అదే రోజు సాయంకాలం కల్పన, అరవింద్ ప్రశాంతంగా కూర్చొని ప్రణాళిక వేసుకుంటున్నారు.

"మమ్మీ! ఏమిటి వ్రాస్తున్నారు?" ఏడవ తరగతి చదువుతున్న శ్వేత అడిగింది.

"శ్వేతా! మనం వందన ఆంటీ వాళ్లకంటే గొప్పవాళ్లం కావాలంటే డబ్బు ఎలా పొదుపు చేయాలో వ్రాసుకుంటున్నాము" అంది కల్పన.

"భలే భలే! అయితే మనం వందన ఆంటీ వాళ్లలా కారు కొనుక్కుంటామా?" అంది శ్వేత.

అవును శ్వేతా! రేపటి నుంచి మనం మన డబ్బుని జాగ్రత్తగా ఖర్చు పెట్టుకుంటే రెండేళ్లలో కారు, బోలెడు నగలు కొనుక్కోవచ్చు. అప్పుడు వందన ఆంటీ వాళ్లలా మనమూ గొప్పవాళ్లం అయిపోతాం" అంది కల్పన.

"అలాగే మమ్మీ!" అంటూ ఆడుకోవడంలో

**జి. మేరీ కృపాబాయి**

## ప్రయోజనం

చిన్నారావుకి చేతిగోళ్ళు కొరుక్కోవడం అలవాటు. ఇది గమనించిన స్నేహితుడు 'యోగ' నేర్చుకోవ డం వల్ల ఆ అలవాటు మానుకోవచ్చని సలహా ఇచ్చాడు.

ఆ సలహా పాటించిన చిన్నారావు 'యోగ' తర గతులకు వెళ్లసాగాడు.

కొన్నాళ్ల తర్వాత కలిసిన స్నేహితుడు చిన్నా రావుని ప్రశ్నించాడు...

'యోగ' వలన ఏమైనా ప్రయోజనం ఉందా?

ఓ... లేకేం... ఇప్పుడు కాలివేళ్లు కూడా సులభం గా అందుతున్నాయి. హుషారుగా బదులిచ్చాడు చిన్నారావు.

మునిగిపోయింది శ్వేత.

ఆ మరుసటి రోజు కల్పన ఆఫీసు పనిపై క్యాంపుకు వెళ్లి, వారం రోజుల తర్వాత ఇంటికి వచ్చింది. కల్పన గేటు తెరచుకొని లోనికి రాగానే శ్వేత ఒక్క పరుగున కల్పనకు ఎదురుగా వెళ్లింది.

"అమ్మా శ్వేతా బావున్నావా?" ఆప్యాయం గా అడిగింది కల్పన.

"బావున్నాను మమ్మీ! నీకో గుడ్ న్యూస్" అంది శ్వేత.

"ఏమిటి శ్వేతా!" ఆసక్తిగా అడిగింది కల్పన.

"మమ్మీ! మనం వందన ఆంటీ వాళ్లకంటే గొప్పవాళ్లం అయిపోయాం" అంది శ్వేత.

శ్వేత మాటలకు ఆశ్చర్యపోతూ - "ఎలా శ్వేతా! అలా ఎలా అవుతాం? డాడీకి ఏదైనా లాటరీ తగిలిందా?" నవ్వుతూ అంది కల్పన అరవింద్ వైపు చూస్తూ.

"అదేం కాదు మమ్మీ! కావాలంటే డాడీని అడుగు" అంది శ్వేత.

"ఏమిటండీ! శ్వేత ఎందుకిలా మాట్లాడు తోంది? శ్వేత చెబుతున్నది నిజమేనా?" అంది కల్పన అరవింద్ నుద్దేశించి.

"అవును కల్పనా! ప్రస్తుతం మనం వందన వాళ్ల కంటే గొప్పవాళ్లం" అన్నాడు అరవింద్.

అరవింద్ మాటలకు మరింత ఆశ్చర్య పోయింది కల్పన. "అదెలా?" అంది విస్తు పోతూ.


"వందన వాళ్లు వారం రోజులుగా ఇంట్లో లేరట. ఏదో ఊరు వెళ్లారట. నిన్న రాత్రి వందన వాళ్లింట్లో దొంగలు పడి ఇంట్లో ఉన్న బంగారు నగలు, డబ్బు పూర్తిగా దోచుకొని, కారుతో సహా ఉడాయించారట. అందువలన శ్వేత అలా అంటోంది. వందన వాళ్లకు ప్రస్తు తం ఇల్లు తప్ప ఏమీ మిగలలేదు" అన్నాడు అరవింద్.

అతని మాటలకు కల్పన ఒక్కసారిగా షాక్ తింది. వెంటనే ఆమెకు ఎక్కడలేని దుఃఖం ముంచుకు వచ్చింది. గుండె పగిలేలా రోదిస్తూ అక్కడే కూలబడి పోయింది.

"ఏమిటి మమ్మీ! నువ్వేగా వందన ఆంటీ వాళ్ల కంటే మనం గొప్పవాళ్లం కావాలని అన్నావు. ఇప్పుడెందుకు ఏడుస్తున్నావు?" అమాయకంగా అడిగింది శ్వేత.

శ్వేత అమాయకపు మాటలకు కల్పన దుఃఖభారం మరింతగా పెరిగింది.

"అది కాదమ్మా శ్వేతా! వందన ఆంటీ నాకులానే ఎన్నో కష్టాలుపడి పైకి వచ్చింది. ఆమె సంపాదించిన ప్రతి పైసా ఆమె కష్టార్జి తమే. ఎంతో పొదుపుగా, తెలివిగా, కష్టాల




నోర్చి, నష్టాలను భరించి ఆ ఆస్తి అంతా సంపాదించింది. తన సుఖమంతా త్యాగం చేసి కుటుంబ సంక్షేమం కోసం ఎన్నో ఇబ్బందులు, మరెన్నో బాధలు అనుభవించింది. అటువంటి వందన నాకు ఆదర్శం. ఆమెను ఆదర్శంగా తీసుకొని ఆమెను అధిగమించాలని నేను కోరుకున్నానే తప్ప ఆమె నాశనమైపోయి, నేను పైకి రావాలని ఎప్పుడూ కోరుకోలేదు. అలా వచ్చే ఉన్నత స్థాయి నాకు అక్కరలేదు.

నేను పైస్థాయిలో కనబడటం కోసం నా స్నేహితురాలు దిగువ స్థాయికి జారిపోకూడదు. నా మనసు అంత సంకుచితం కాదు. వందన కష్టార్జితం అలా దోచుకోబడటం నేను తట్టుకోలేను" రోదిస్తూనే చెప్పింది కల్పన.

కల్పన మాటలు శ్వేతకు అర్థం కాలేదు. కానీ అరవింద్ కల్పన మాటలలోని స్వచ్ఛతను గ్రహించగలిగాడు. కల్పన విశాల హృదయానికి అతని హృదయం ఆనందంతో ఉప్పొంగిపోయింది.

అరవింద్ కల్పనకు దగ్గరగా వెళ్లాడు. ఆమె భుజంపై చేయివేసి ధైర్య వచనాలు పలికాడు.

"కల్పనా! బాధపడకు. నీకు నీ స్నేహితురాలిపై ఎంత ప్రేమ ఉందో నేను గ్రహించగలిగాను. ఒకప్పుడు నీ మనసుని నేను కూడా సరిగా గ్రహించలేకపోయాను. నీదంతా అసూయ అనుకున్నాను. ఈ రోజు నీ మనసులోని స్వచ్ఛతను చవిచూసాను. ఎదుటివారి ఔన్నత్యానికి ఈర్ష్యపడటం సహజం. కానీ అంత మాత్రంచేత వారు పాడైపోవాలని కోరుకోవడం మూర్ఖత్వం, అమానుషం. వారిని ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలే తప్ప వారిని పడగొట్టి ఉన్నత శిఖరాలను అధిరోహించినట్లు భావించకూడదనే నీ ఆలోచనలోని గొప్పదనం నాకు బాగా అర్థమైంది. కల్పనా! ప్లీజ్... బాధపడకు. వందన కష్టార్జితం ఎక్కడికీ పోదు. అది త్వరలోనే వారికి దక్కుతుంది" అంటూ హృదయపూర్వకంగా ఆమెను ఓదార్చాడు అరవింద్. ●